కథ:

# కుందనం సింధు

రచన:
శ్రీమల్లాది రామకృష్ణశాస్త్రి

సూరియగిరికాడ, ఆ కొండ కానుకనే
ఉండదిగంద సెందిరగిరి - అల్లదిగో,
ఆ సెందిరగిరి మొగదల యేయికాలాలకు
ముందో పల్లెకోన, కోనలో, పైన
మొయిలు గమ్మి
సిత్తకు సినుకట్టి, స్వాతికి ముత్తెంబుట్టినట్టు,
కొమ్మకు సిగురేసి,
రెమ్మసాటున మొగ్గేసి, మొగ్గలిచ్చి
పూవులాయెనే-సేతికందినవాయెనే !-

సి..లో పూలెట్టి, మొగ్గలన్ని పుణికి పట్టి, - "కానరాని బగమంతుడా, బూదేవమ్మకు పైరులిచ్చి పంటలిచ్చి, సల్లంగ సూసినాపుగా-మాయిడంటున పూపరాలినా, పండుపక్కేనే - నేనేన బైసిని-ముమ్మారు సటికట్టేసు కుంటిని; ముచ్చటలేకుండ జేసినావయ్యా-అయ్యా, ఒక్కకందును మిగల్చవయ్యా - కంటతడి ఆరేను - యీలోకాన్ని సూసేకంట నన్ను జూడవయ్యా-" అని, ఆ యవ్వ మొక్కుకోంగా - మొక్కిన మొక్కులు అక్కరకు రాంగా, సిటారు మానుకు, సేయందే కొమ్మకు. ఊగూగు కట్టి, ఆనలును నందున పన్నుండబెట్టి, - "ముద్దు తీరుచుకోను-మురిపెందీరుచుకోను. పుట్టినకూనా నీకు పేరెట్టుకోను, ఏ పవలుకా వెలుగు, ఏరేయికానీడ, ఆ కానరాని వోడే యిచ్చేను - దగమాలి దప్పికమాలి, కన్నవోరి ఊసుమాని, నీ బతుకు నీవు బతుకమ్మా - బతకిమ్మా-...."

"కానరానివోడా, యీ సేతుల పెంపకాన, యీ సిగురు వాడేనూ, యీ కంటి సూపున యీ పూవు రాలేనో - నాబ్రిమత నేనే మాపుకుంద ! - కూనను నీకిచ్చుకుంద!-" అనుకోని, సులియెచ్చనియెన్న, ఆకూనకు మైనిండ అరగారగ దూమెరుగు సిక్కంగనిచ్చి, అరసేతులపట్టి, ఆబిడ్డను-యెన్నెల్లో ఆకడ యిడిసిపోయెనా - మరి ఆ కూనను సాకిందెవరు-అంతటా కమ్ముకున్న ఆబగమంతుడా-?- యేసినయేసాలు, ఎత్తిన అవతారాలు సాలకపోయెనో అన్నట్టు. మందదూసుకున్న సెదురువాటు గంగిగోవొచ్చి, కేఁరుమనే కందుకు దగదీర్చె, పొరాడనేర్పె, పరుగులు నేర్పె— బతకమ్మకు. సరులకు రేని సూపొచ్చె,
దాసాని రేకంటి మెరుగొచ్చె -
ముక్కున ముత్తెం గట్టి నట్టు పంటికి
నవ్వొచ్చె - వంటి మీద వయసొచ్చె-కాని,
సీతామ్మ వోరు, నార సీరైన కట్టింది-
బతకమ్మేంగట్టింది - బంగన బయలు !
నారదులవోరి యీణె పలికింది - బతకమ్మేం
బరికింది: ఏకాడ నుండో -
వోరో పిలిసినట్టు - ఊఁ కొట్టేది -
ఏ వేళ గాని, మునివేళ్ల రెక్కించు కునేది
- అదేంజపమొ
ఎండ గాని యెన్నెల గాని, ఎన్ని
పొద్దులైన - నిలబడి అట్టె నిలుసుండేది-
అదేంతపమో -
అదేంతపనో -

పాలు బట్టిన గంగిగోవు - ఏ కొండనున్న,ఏ కోననున్న, యెదుక్కుంటూవచ్చి, ఊదూది, ధూలి దులిపి, దూగారు దుపిలి, - సేపేది - ఆ గంగిగోవునో బండ శిల కాడికి కొంచుపోయి, ఊకొట్టేది, బతకమ్మ - పాల తడిసేది బండ శిల,

వరద లొచ్చె, వానలొచ్చె, బెండు మునిగి గుండు తేరే సత్తె కాలం వచ్చె, పాలదడిసి బండ శిల - కరిగింది - ముక్హా మొగం దేరింది- సేతులు జాచుకున్నయ్- పిక్క బట్టింది - బండ శిలకు దుక్క బట్టింది.

అట్టుండగా - ఉండంగా,- ఓ పొద్దున, దూళి గమ్మిన వోడు - సిగ జడలు కట్టిన వోడు, - ఏకడ పుట్టెనో, ఏ నీడ పెరిగెనో, తా నీడకు వచ్చి నాడా - బతకమ్మ నెదుక్కుంటూ వచ్చినాడా, ఆ యవ్వ ఆకడ నుండేనని ఏ దైవం సెప్పెనో, ఏ అయ్య, దారి సూపెనో- వచ్చిరాంగనే బతకమ్మను సూసి, ఆ యవ్వకు మొక్కి, యిట్టని మనవి సేసుకున్నాడు గంద-

ఓ అవ్వా, పుట్టను పుట్టిన వాడు, ఋషి అయినాడు. చింతమానులో పెరిగిన వాడు కైతగాడయినాడు. వారు దైవాన్ని పొగడినారు. నీవు పుట్టించినావు- నీకు పేరు లేకపోయెనని - వీరికి పేరెట్టవా - నీవు మబ్బుల నీడను బ్రతికేవు కాని, యీ అబ్బకు, గుడీ గోపురమూ వద్దా !- అవ్వా, నిను కన్న ఉత్తమురాలికి బతుకంతా వగజేసి నాడని, యీ పరంధాముని పసిపాపను చేసి పన్నుండ బెట్టినావా - నీ ఊగూగులు విన్నంత కాలమూ, యీ స్వామి పాపడై పొరాడేను - నీ తల్లి నిన్ను పేరెట్టి పిలువ లేక, తాను బతికించు కోలేనని లోకానికిచ్చి నది - యీ లోకేశునికి నామ కరణము జేసి మా కివ్వు ఎమ్మా-" అనంగా బతకమ్మ వేయి వెన్నెలలు మురిసినట్టు నవ్వి- బిడ్డ మోము పుణికినట్టు, మొగాన వాలిన ముంగురులు దిద్దనట్టు సేయాడించి, మొగానికి సేయద్దంగా - ఆకడ మూడు గీరలు దేరె. అల్లదీ- నామాల వోడు అట్టా యెలిసినాడా- యెలిసినాడో, బతుకమ్మకు పలుకొచ్చింది- అన్నది గంద- ఓరి కూన, యెన్నెల ముదిరి యేరు కాదురా - యేరు పొంగి సంద్రం కాదురా - నేనెల్లకాలం జోలపాటనేరా- కాని, సిగురు సేవదేరి, ముదురాకైనట్టు - యీ పొరాడే వోడు - పెరగాలిగా, పెద్ద వోడవాలిగా- కానీ, శిలగా బుట్టినా, నరుడి కంట బడంగనే వీనికి తిప్పలొచ్చెరా - యెన్నరాచి పెంచరా - నీ కంటికి ఆనే రూపు వచ్చేను - అట్టె ఎదిగిన వోడికి మనువు సేసేవా - సెయ్ - బూమి పుట్టక ముందు - పుట్టెరా పైనున్నది - వీని కన్న ముందు బుట్టిన దానికి, యెనక బుట్టిన ఆడకూతురు యెదుక్కుంటూ వచ్చి సేసుకుంటుందిలే- కాని, మనువు దక్కినా, - బడుగు కంట బుట్టి పాల సిందులో రూపైన వోడు, సివరకు జడలు గట్టిన వోడికి సేత సిక్కిన వోడు వీడికి గూడుండదురా- సేతి కందే ఆడ తోడుండదురా- నే నొంటి బతుకైతిని - నా బిడ్డ దట్టాకాదా- మనువు సేసుకొన్నా- తానొక్కడే మొక్కించుకొనేనురా- ఆకా

శాన పుట్టిన కన్నె - బూమిమీద పుట్టిన వానికోసం రాంగనే - బూమి ఆకాశ మయ్యేను - ఆకాశం బూమయ్యేను: వీడు-యీకడ, ఆ యవ్వ ఆకడ: ఓరికూన, అది నీకు సూడంగ ముచ్చటా - నేను సూడ లేనురా - నన్నిట్టు జోలపాడుకోనీ- అని బతకమ్మ - ఊగూగై - వాగైపాయె: ఆ యవ్వ పాడిన జోలలు, పచ్చ కప్పురపు పలుకులై - వాగున గలిసె - నామాల వోడు, ఆ వాగు నీటను కాని తానమాడదు: వాడు మనకు దేవుడు కాని, తల్లిని మరు వని బిడ్డగాదా- నులివెచ్చని వెన్న గాని, దూమెరుగు రాసు కోడు - 'ఎందుకంటవా' ఆ యెన్నే తనకు కన్న తల్లాయె - పాలు మీగడ గుమ్మరించకుంటడు ఏల - వాడికి రూపిచ్చి నది గంగిగోవు -

ఆ జడలవోడు - కృష్ణమాసారుగద ; ఆట్టె బతకమ్మ వాగై పొంగనె - సేతు లుఖ్ఖవబట్టి, సిత్తగింపులు సెప్పుకొన్నాడు గందా - నామాలవోడా - బతకమ్మ పుట కిచ్చిన వోడా ; - నాబుద్ధికి సెబ్బరొచ్చి నీకు వయసిచ్చింది - నీమీద పాడుకుంట; సిందులు శివాలుగా ఆడుకుంట ;. అంతె కాని, నాసేతులార నీకు ఆడుతగులాట మంటగట్టాను ; జోగివోడు కొలుసుకునే దైవం జోగిలాగుండేనో, ఏయేళ కోరినా దరిసెనమిచ్చేను-కాని ఓ ఆడకూతురొచ్చి, నీ గూ ట దివ్వెలిగించెనో, ఏసిలక పలు కులో పలుకుతూండంగ సేరరావల్లనా, సిక్కనగ యిద్దరూ ఒకటిగా ఉండంగ, పలుకరించంగ వల్లనా-నీవిట్టానే ఉండు - నిన్నిట్టానే కొలుసుకునేను-అన్నాదుకాదా- ఆ అయ్య నెంజిలిదీరంగ సిందేసినాడు, ఆ సిందులు నెమిళ్లు నేర్చుకున్నవి. శివ మెత్తి ఉరికే లేగల మందలుజూసి. అంభా అనంగ దద్దరిలిన మొయిలుజూసి - బత కమ్మ బిడ్డనుజూసి - గోవింద - గోవింద అని, - అరటిమ్రాలై పోయెనుగా - తాను.

గోవింద- గోవింద సందడి విన్నకాని, వానికి పొద్దుపోదు.

బతకమ్మ బిడ్డడు-బతుకు నేర్చినాడు - జారల కెదిగినాడు - బతుక నేర్చినాడు. ఆ యవ్వ సేతిలువే వానికి - నామమాయె. ఆ యవ్వ తనను సాకినట్టూ ఎదరపడిన వాని, ఆపదల సిల్లర మల్లర' సిగపాయ దీసి, సేతసిక్కించుకోడమే - వాడికి నీమ మాయె - కాని, రచ్చగెలిచినవోడు యింట గెలవకపోయె. ఎల్ల కాలమూ, అది ఒంటిబతుకై పాయె. వాడో కుందనం సిందాయో !

## "అంతిమసంధ్య"

ఈ మృత్యుపూజాగృహపు
అంతరాంతరాల
స్వాప్నిలసురభిళాన్ని జార్చే
బ్రతుకుపొగవలె
క్రమ్మింది అంతిమసంధ్య.
ఎవరో చెప్పారిక్కడ నీవుంటావని.
నన్నంతా అక్కడ ఎంతగా ఉండమని
బ్రతిమాలినట్లు చూశారో!
అయినా దిగులుగుండె దీపంగా
పెట్టుకొని
కాలపు ప్రక్కపై ఎంతసేపని
పడిఉండేది?

అందుకే ప్రక్కచుట్టేసి వచ్చేశాను.
తీరా ఇంతదూరం పరుగెత్తుకొస్తే
ఎక్కడా కనిపించవేం? నీవు?
తెరచుకొన్న కవాటాలే మూసి
ఉంచినయ్ నిన్ను

ఏంచేయను నేను?
ఎన్నాళ్ళైందో నాయీ యాత్ర
మొదలయి
రాత్రికాని పగలు రాని - యీవేళ
ఒంటిగా నీమందిరం
మధ్యలో కూర్చొని
కాలకంజాతంలోని క్షణాలరేకుల్ని
లాగేస్తూ
ఎంతసేపని పిచ్చిగా చూడమంటావ్?
ఎలా గడపమంటావ్ యీ
అంతిమసంధ్య?

వెతుక్కనేందుకేమీ లేదిక్కడ.
నీవున్నావని చెప్పేందుకు గుర్తుగా
నీవులేని పూజాపీఠంపై నిలిపిన
యీ అపార పూజాసామగ్రి తప్ప.

వెఱ్ఱినై నీకోసం వెదుక్కనే,
నాముందు నిలిచిన
ఈ శూన్యాలయసీమా కుడ్యాలపై
ప్రాక్తేజ్ఞాపకంలోని మరపునీడలు
రహోరమ్యరేఖా చిత్రాలను
అణువణువునా లిఖించి
క్షణ క్షణం కలిసి పోతున్నయ్
ఈ అంతిమ సంధ్యలో.

నామౌనబాధా నదీతీరాంచలాల
అర్ధభగ్నస్మృతి కన్స్మృతివలె
యీ పాడుబడ్డ గుడిగోపురాల
అర్ధ నగ్న సౌందర్యం
ఆకాశంలోకి వెఱ్ఱిగా చూస్తోంది.

చివరికి నేనుమాత్రం పడిఉన్నాను.
మూసిన కన్నులముందు
మూయని అవ్యక్తంలో
అంతంలేని అంతిమసంధ్యవలె.

రచన శ్రీ అరిపిరాల విశ్వం.

—:x:—